
దీపావళి
శుభాకాంక్షలు
పటాన్‌చెరు నియోజకవర్గ, తెల్లాపూర్ మున్సిపల్ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు
బాలగోని రాములు గౌడ్
మాజీ వైస్ చైర్మన్
తెల్లాపూర్ పురపాలక సంఘం
మాజీ జడ్పీటిసి-రామచంద్రాపురం మండలం
బాలగోని సాయిచరణ్‌గౌడ్
బీఆర్ఎస్ యువజన నాయకులు
పటాన్‌చెరు నియోజకవర్గం

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నిర్మలా జగ్గారెడ్డి

● దీపావళి శుభాకాంక్షలు తెలిపిన టీజీఐఐసీ ఛైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన లైసెన్స్ సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్‌లు పంపిణీ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిర్మలా జగ్గారెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసిన నిర్మలా జగ్గారెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి



లైసెన్స్ సర్వేయర్‌గా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్‌లు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, నిర్మలాజగ్గారెడ్డి

పురుగుల మందు కలిపిన నీటిని తాగి 21 మేకలు మృతి

కోహీర్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి) పురుగుల మందు కలిపిన నీటిని తాగి 21 మేకలు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గోపీనాయక్ తండాలో ఆదివారం జరిగింది. గోపీనాయక్ తండాకు చెందిన కిషన్ అనే గిరిజన రైతుకు చెందిన 21 మేకలు ఆదివారం మధ్యాహ్నం తండా సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు మేత కోసం తీసుకువెళ్లారు. అయితే అక్కడ పంటకు పిచ్చికారి చేసేందుకు బకెట్లో కలిపి ఉంచిన పురుగుల మందును మేకలు తాగడంతో 21 మేకలు అక్కడికక్కడే మృతి చెందినట్లు తాండవాసులు తెలిపారు. బాధిత రైతుకు రెండు లక్షల వరకు నష్టం జరిగినట్లు తాండ గిరిజనులు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గిరిజనులు కోరారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

ములుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ములుగు మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో గో రక్షక్ దళ్, బజరంగ్ దళ్, బీజేపీ కార్యకర్తలు వంటిమామిడి వద్ద అడ్డుకున్నారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి వస్తున్న ఈ కంటైనర్‌లో 150 గోవులను అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. గోవుల కంటైనర్‌ను ములుగు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా గోశాలకు తరలించారు.

26.4 కేజీల ఎండు గంజాయి పట్టివేత

పటాన్‌చెరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రవాణా చేస్తున్న ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సీఐ వినాయక రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వీరేంద్ర కుమార్ జన్నా అనే వ్యక్తి రూ.13.2 లక్షలు విలువ చేసే 26.4 కేజీల ఎండు గంజాయిని తెల్లాపూర్ పురపాలక పరిధిలోని ముత్తంగి ఔటర్ సర్వీస్‌రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తికి ఇవ్వడానికి వచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు మాటు వేసి శనివారం సాయంత్రం వీరేంద్ర కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కంది, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కందిలోని కిసాన్‌సాగర్ చెరువు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటకు చెందిన డప్పు బాలరాజ్ (38) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. పదిహేనేళ్ల క్రితం సంగారెడ్డికి చెందిన జ్యోతితో వివాహం కాగా, వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా బాలరాజ్ కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతగా బాగాలేక సంసారం నడపడం కష్టంగా మారింది. ఈ విషయంలో తరచుగా కలహాలు జరుగుతుండడంతో మనోవేదనకు గురైన బాలరాజ్ ఈ నెల 17న కందిలోని కిసాన్‌సాగర్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆటో కిస్తీలు కట్టలేక ఆటో డ్రైవర్..

వెల్దుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, ఆటో కిస్తీలు కట్టలేక మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వెల్దుర్తి పట్టణానికి చెందిన మేడ్చల్ నాగరాజు (33) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆటో సరిగా నడవకపోవడంతో దానిపై ఉన్న కిస్తీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడ్డాడు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం వెల్దుర్తిలోని తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఉరివేసుకుంటున్నట్లు తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే పొలం వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు నాగరాజు చెట్టుకు ఉరివేసుకుని ఉండడం చూశారు. వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే నాగరాజు మృతి చెందారు.

ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారుడు..

మెదక్ అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ స్వర్ణకారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉదయం చోటు చేసుకుంది. పట్టణంలోని పెద్దబజార్‌కు చెందిన లస్కరి నరేష్(40) కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బంగారం ధరలు పెరగడం, రెడీమేడ్ నగలు అందుబాటులోకి రావడంతో గత కొన్ని రోజులుగా పనులు సరిగా జరగక కుటుంబ పోషణ భారమైంది. దీంతో చేసిన అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

చేపల వేటకు వెళ్లి.. నీటిలో శవమై తేలి...

పుల్కల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకార్మికుడి మృతదేహం ఆచూకీ నాలుగు రోజుల తర్వాత ఆదివారం లభించింది. సదాశివపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన దాసరి కుమార్ (36) కుటుంబంతో కలిసి గత కొంత కాలంగా సింగూరు గ్రామంలో నివాసముంటూ, సింగూరు ప్రాజెక్టులో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. కుమార్ ఈ నెల 16 వ తేదీన ప్రాజెక్టులో వలలు వేసేందుకు వెళ్లాడు. వలలను తీసేందుకు 17వ తేదీన ఉదయం తెప్పపై నీటిలోకి దిగాడు. అయితే, రోజు మాదిరి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మత్స్యకార్మికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతైన నాలుగు రోజుల తర్వాత దాసరి కుమార్ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ప్రాజెక్టు నీటిలో తేలియాడుతూ మత్స్యకార్మికులకు కనిపించింది.

చెరువులో పడి వ్యక్తి మృతి

మెదక్ అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెరువలో పడి వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని దాయరా వీధికి చెందిన మహేష్ (28) శనివారం సాయంత్రం అదే కాలనీ శివారులోని గో సముద్రం చెరువుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు చెరువులో గాలించగా, మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ మహేష్ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

జిన్నారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మరణించాడు. జిన్నారం ఎస్‌ఐ హన్మంతు తెలిపిన వివరాల ప్రకారం.. వావిలాల పరిధిలోని చౌదరిగూడెం గ్రామానికి చెందిన పాండురంగాచారి (47) ఈ నెల 18న స్థానిక లింగం చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతు అయ్యాడు. ఆదివారం పాండురంగాచారి మృతదేహాన్ని వెలికి తీసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.


ABN ఆంధ్రజ్యోతి కి
23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు,
నాయకులకు, కార్యకర్తలకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
దీపావళి
శుభాకాంక్షలు
శ్రీమతి & శ్రీ మల్లేపల్లి లలిత-సోమిరెడ్డి
తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, పటాన్‌చెరు నియోజకవర్గం

ఉత్తర భారతీయులు తెలంగాణవాసులే

● ఎమ్మెల్యే మహిపాల్‌రరెడ్డి



ఉత్తర భారతీయులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నివాసముంటున్న ప్రతి ఒక్కరూ స్థానికులేనని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామంలో ఉత్తరభారతీయుల ఛట్‌పూజ విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య ఆలయం నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఉత్తరభారతీయులతో సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఎంపీటీ సీగా ఎన్నికైన సందర్భంలో పూర్తి సహకారం అందించారని వివరించారు. ఛట్‌పూజకు కావాల్సిన చెరుకు గడలను ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సాకి చెరువు కట్టపై సూర్యదేవ ఆలయం నిర్మించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, మాజీ ఎంపీపీలు యాదగిరియాదవ్, శ్రీశైలంయాదవ్, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సీఐ విజయకృష్ణ పాల్గొన్నారు.

అందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

జహీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతిఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధిచెందాలని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కిద్మత్ మ్యూచ్‌వల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిరువ్యాపారులకు ఇది మంచి అవకాశమని, ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖాతాదారుల ద్వారా డిపాజిట్ల రూపేణా సేకరించిన నగదును వారికి సకాలంలో ఇచ్చేందుకు సంస్థ కృషి చేయాలన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఇలాంటి సంస్థ ఏర్పాటుకావడం సంతోషకరమన్నారు. రుణ సంస్థలో అప్పులు తీసుకుని సకాంలో తిరిగి చెల్లించాలన్నారు. అనంతరం కిద్మత్ అధికారులు ఎక్బాల్ హుస్సేన్, ఇక్బాల్ మోయియోద్దీన్ ముంతాజ్ మాట్లాడారు. కిద్మత్ బ్యాంకు 6,500 మంది ఖాతాదారులు, రూ.15 కోట్ల టర్నోవర్‌తో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచగామలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

నారాయణఖేడ్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంచగామ(పంచవటి)లోని శ్రీనాగేశ్వర ఆలయంలో ఆదివారం మాస శివరాత్రిని పురస్కరించుకొని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి కాశీనాథ్‌బాబా భక్తులను ఉద్దేశించి ప్రవచనాలిచ్చారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన గణేష్ మహారాజ్, మల్లయ్యస్వామి, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

● అడ్డుకున్న స్థానికులు
● పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు

అల్లాదుర్గం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిని కబ్జాకు యత్నించగా.. స్థానికులు అడ్డుకున్న సంఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లిలో ఆదివారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామ శివారులోని సర్వే నంబరు 36లో గల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసేందుకు యత్నించడంతో కొన్నిరోజుల క్రితం గ్రామస్థులందరూ సమావేశమై కబ్జాదారులకు నచ్చజెప్పినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం ఆ భూమిని కబ్జా చేసేందుకు ఎక్స్‌కవేటర్ సహాయంతో భూమిని చదును చేస్తుండగా స్థానికులు మరోమారు అడ్డుకొని ఎక్స్‌కవేటర్‌ను తిప్పి పంపించారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగడంతో పాటు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని సంరక్షించి, ఆ స్థలం వద్ద తహసీల్దార్ అధికారులు బోర్డులను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

నర్సాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు వెంటనే ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను వెంటనే ఇవ్వాలని తపస్ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం నర్సాపూర్‌లో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించడంతో పాటు పెండింగ్ డీఏలను ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు తపస్ సంఘం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి రవి, కొండల్, రాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


కోహీర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో ఆదివారం వై.నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ అపోలో హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వివిధ ఆరోగ్య సమస్య ఉన్నవారికి వైద్య సిబ్బంది ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎముకల వ్యాధులు, సాధారణ వ్యాధులు, సాధారణ సర్జరీ వైద్య సేవలు, ప్రసూతి వైద్యసేవలు, చెవి, ముక్కు, గొంతు వంటి వైద్య సేవలను ఉచితంగా నిర్వహించారు. పేద రోగుల కోసం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంపై గ్రామస్థులు నరసింహారెడ్డిని, అపోలో హాస్పిటల్ సిబ్బందిని, మాజీ సర్పంచ్ మొల్లయ్యను అభినందించారు. ఈ శిబిరంలో దాదాపు 200 మంది రోగులు వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ మొల్లయ్య, డాక్టర్లు అక్షయ్, పృథ్వీ, ప్రవళిక, శరత్, హైమవతి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మెదక్‌లో టపాసులు కాల్చుతున్న బాలుడు

ఘనంగా దీపావళి

నాగల్‌గిద్ద, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కూబ, మేగ్యా, శ్యామ తండాలో ఆదివారం దీపావళి సంబురాలు జరుపుకున్నారు. పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భజనలు చేపట్టారు.



స్టాంపు పేపర్ల కొరతతో అవస్థలు

నారాయణఖేడ్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్టాంపు పేపర్ల కొరతతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నోటరీలు, అఫిడవిట్లు, బ్యాంకు రుణాలు పొందడానికి స్టాంపు పేపర్లు వినియోగిస్తున్నారు. నారాయణఖేడ్‌లో నెల రోజులుగా డిమాండ్‌కు సరిపడినన్ని స్టాంప్ పేపర్లను ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. దీంతో చిన్న రుణాలు అవసరమైన రైతులు, ఒప్పంద పత్రాలు రాసుకునేవారు ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రూ.10-రూ.100 బాండు పేపర్లను సరఫరా చేయాలని కోరుతున్నారు.




సంగారెడ్డిలో బొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు

దీపాల వెలుగు.. ధరల గుబులు


మార్కెట్లలో రద్దీ.. పెరిగిన పూలు, టపాసుల ధరలు

మెదక్/మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి సంబరాలకు పల్లెలు పట్టణాలు ముస్తాబయ్యాయి. మార్కెట్లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. మరోవైపు ధరలు మాత్రం సామాన్యులను బెదరగొడుతున్నాయి. మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్, చేగుంట తదితర పట్టణాల్లో మార్కెట్లు పండుగ శోభను సంతరించుకున్నాయి. దీపావళికి పూలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడుతుంది. ఈసారి కిలో మల్లెపూలు రూ.700, కనకాంబరాలు రూ.1,200, చామంతులు రూ.500, తెల్ల చామంతి కిలో రూ.550, ఆస్టల్ కిలో రూ.300, గులాబీ కిలో రూ.600, మల్బరీ కిలో రూ.800, బంతిపూలు రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పూల తోటలు దెబ్బతినడంతో రేట్లు భారీగా పెరిగాయని మెదక్‌కు చెందిన పూల వ్యాపారి షేక్‌అహ్మద్ తెలిపారు. చిన్న శంకరంపేట మండలం నడిమితాండాకు చెందిన రైతు నరేష్ మాట్లాడుతూ గత నెలలో కురిసిన కుంభవృష్టికి రెండెకరాల్లో వేసిన బంతి చేను పూర్తిగా దెబ్బతిన్నదని చెప్పారు. తానే హైదరాబాద్‌లో పూలు కొనుగోలు చేసి మెదక్‌లో రీటైల్‌గా విక్రయిస్తున్నాని తెలిపారు.

తగ్గిన టపాసుల గిరాకీ

దీపావళి వచ్చిందటే టపాకాయలు గుర్తుకువస్తాయి. కానీ ఈసారి ఉత్సాహం కొంత తగ్గింది. టపాసుల ధరలు పెరగడం, రైతులకు పంట డబ్బులు ఇంకా చేతికి రాకపోవడంతో టపాసులు కొనడానికి వెనకడుగు వేస్తున్నారు. మెదక్ కాలేజీ గ్రౌండ్‌లో గత సంవత్సరం 23 స్టాల్స్ ఏర్పాటు చేయగా.. ఈసారి 18 షాపులు మాత్రమే ఏర్పాటు చేశారు. పూలు, ప్రమిదలు, టపాసుల కోసం రూ.1,500 ఖర్చవుతోందని మెదక్ చెందిన వినియోగదారుడు సార మురళి వివరించాడు. ధరలు భారీగా పెరగడంతో పండుగ ఖర్చు తడిసిమోపెడవుతోందని ఆయన వాపోయారు.







ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరా : మెదక్ కలెక్టర్

మెదక్, కల్చరల్/రామయంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మెదక్ మండల పరిధిలోని పాతూరులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి విద్యుత్ సరఫరా జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. వ్యవసాయానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన రామాయంపేట పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. గంట సేపు అక్కడే ఉండి అగ్నిమాపక వాహనాన్ని, సిబ్బంది, సామగ్రి సన్నద్ధతను పరిశీలించారు. ఏ క్షణాన అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఫైర్‌స్టేషన్ హైవేకు దగ్గరగా ఉన్నందున అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




ఏడుపాయలలో భక్తుల సందడి

జనసంద్రమైన ఏడుపాయల

సల్ప వరద.. రాజగోపురంలోనే పూజలు

పాపన్నపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం ఆదివారం జనసంద్రమైంది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మంజీరా నదిలో వరద పెరగడంతో గర్భాలయంలో దర్శనాలను నిలిపేశారు. అమ్మవారికి నిత్య పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాన్ని మూసివేసి, ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.




















ఊరికి వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి : ఎస్ఐ

నర్సాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్‌లో అద్దెకు ఉంటూ పండుగలకు స్వగ్రామాలకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాళం వేసి వెళ్లే ఇళ్లల్లో దొంగలు పడే అవకాశం ఉన్నందున తాళాలు నాణ్యమైనవి వేయాలని, తలుపులు, కిటికీలు సరిచూసుకోవాలని అన్నారు. పక్కింటివారికి సమాచారమివ్వడమే కాకుండా రాత్రివేళ ఒకటి రెండు లైట్లు ఆన్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. బంగారం, నగదు, పత్రాలు ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్‌లో లేదా విశ్వసనీయ వ్యక్తి వద్ద ఉంచాలన్నారు.











రోడ్డుపైనే సౌండ్ బాక్సులు!




రోడ్డుపై ఉన్న సౌండ్ బాక్సులు

శివ్వంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రుల కోసం ఓ నాయకుడు సొంత నిధులతో ఇప్పించిన సౌండ్ బాక్స్‌ల విషయంలో నిర్వాహకుల మధ్య మనస్పర్థలు రావడంతో వాటిని రోడ్డుపై వదిలేశారు. నెలరోజులుగా అవి ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడైపోయాయి. మండల కేంద్రమైన శివ్వంపేటలోని మూడో వార్డులో ప్రతీ సంవత్సరం వినాయక నవరాత్రులు నిర్వహిస్తారు. కాగా గతేడాది ఓ నాయకుడు రూ.6 వేలు వెచ్చించి సౌండ్ బాక్సులు ఇప్పించాడు. వ్యక్తిగత కార్యక్రమాలకు వినియోగించొద్దని చెప్పడంతో నిర్వాహకుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో తమ ఇళ్లల్లో బాక్సులు పెట్టుకోమని రోడ్డుపైనే ఉంచడంతో అవి పూర్తిగా పాడైపోయాయి

























ఫైనాన్స్ అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా అపర్ణ

కంగ్టి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 ఫలితాల్లో మండలంలోని తుర్కవడగాంకు చెందిన పొతిరెడ్డి అపర్ణ ఫైనాన్స్ శాఖలో అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా సెక్రటేరియట్‌లో నియామకమయ్యారు. రెవెన్యూశాఖలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో గ్రూప్-2 ద్వారా ఫైనాన్స్‌శాఖలో సెక్షన్ అధికారిగా నియామకం కావడం అభినందనీయమన్నారు.

యువతి అదృశ్యం

నర్సాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం తిర్మలాపూర్‌లో చోటు చేసుకున్నది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మి, చంద్రయ్య రెండో కూతురు తులసి నర్సాపూర్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంది. 18న పనికి వెళ్లి రాత్రి 9 దాటినా ఇంటికి రాలేదు. సదరు షాపింగ్ మాల్‌కు ఫోన్ చేయగా.. ఆరోజు విధులకే రాలేదని తెలిపారు. తులసికి ఫోన్‌చేయగా స్పందించలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

హవేళిఘణపూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని స్కూల్‌తండాలో చోటు చేసుకున్నది. తండాకు చెందిన నేనావత్ పుల్య ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. మంటలు రావడంతో పక్కింటి వారు గమనించి పుల్యకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. సిబ్బంది చేరుకునేలోపే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న రూ.90 వేలు, 2 తులాల బంగారం, మూడు క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర వస్తువులు కాలిపోయాయి.



